క్లుప్తంగా

భూసమస్య పరిష్కారానికి వినతి

గాజువాక : గాజువాక హౌస్ కమిటీ భూ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీడీపీ నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఇన్‌చార్జి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో వివిధ జీవోల ద్వారా మంజూరు చేసిన పట్టాలపై ఆంక్షలను తొలగించి రిజిస్ట్రేషన్లు, ప్లాన్ అనుమతులకు సమ్మతించాలని కోరారు. కార్యక్రమంలో 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, వాసు, సమ్మిడి ఉమ, కదిరి పోలరాజు తదితరులు పాల్గొన్నారు.

'కులుకూరి'కి సత్కారం



మంగరాజును సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 64, 65, 74, 75, 76 వార్డుల మండల క్లస్టర్ కన్వీనర్‌గా నియమితులైన కులుకూరి మంగరాజును ఆర్యవైశ్య సంఘం పెదగంట్యాడ సభ్యులు సోమవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో త్రిమూర్తులు, ముత్యాలశెట్టి, కుమార్, కులుకూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన



సదస్సులో ప్రసంగిస్తున్న విశ్రాంత న్యాయమూర్తి సార్వభౌమారావు

గాజువాక: ప్రతి ఒక్కరూ న్యాయపరమైన అంశాలపై, చట్టాలపై అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమని విశ్రాంత న్యాయమూర్తి డి.సార్వభౌమారావు అన్నారు. స్థానిక టీపీ స్వార్, టీబీకే డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన ప్రసంగించారు. పోక్సో చట్టంపై ప్రతి విద్యార్థి అవగాహన పెంచుకోవాలన్నారు. పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడిన నిందితులకు ఈ చట్టం ప్రకారం యావజ్జీవ ఖైదును విధిస్తారన్నారు. కనీసం ఐదు నెలలపాటు బెయిల్ కూడా ఇవ్వరని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా విశ్రాంత న్యాయమూర్తి డి.లక్ష్మీ కామేశ్వరి కళాశాల చైర్మన్ టి.బలరామకృష్ణ, కరస్పాండెంట్ టి.ఉమా మహేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సినీ ఉత్సవం ప్రారంభం

సీతంపేట: తెలుగు సినిమా ఉత్సవం ఘనంగా ప్రారంభమైంది. తెలుగు తొలి టాకీ సినిమా భక్తప్రహ్లాద 1932 ఫిబ్రవరి 6న విడుదలై 91 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వైజాగ్ ఫిల్మ్ సొసైటీ మూడు రోజుల పాటు ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తోంది. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సోమవారం సాయంత్రం సినీ దర్శకుడు వి.ఎస్.ఆదిత్య జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ముందుగా సినీ దిగ్గజాలు కె.విశ్వనాథ్, జమున చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదిత్య మాట్లాడుతూ మానవ విలువలను స్పృశించే సినిమాలను ప్రజలకు చేరువ కావాలని ఫిల్మ్ సొసైటీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అనంతరం కళాతపస్వి కె.విశ్వనాథ్ దర్శకత్వంలో జమున నటించిన ఉండమ్మా బొట్టు పెడతా చిత్రాన్ని ప్రదర్శించారు. ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

ఫిల్మ్ మేకింగ్‌పై వర్క్‌షాప్ నేడు

వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఫిల్మ్ మేకింగ్‌పై ఉచిత వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు ప్రకటనలో తెలిపారు. ప్రముఖ చిత్ర దర్శకుడు వి.ఎస్.ఆదిత్య ఫిల్మ్ మేకింగ్‌పై శిక్షణ ఇస్తారని తెలిపారు. 18 ఏళ్ల వయసు దాటిన ఔత్సాహిక యువతీ యువకులు, విద్యార్థులు వర్క్‌షాప్‌లో పాల్గొనవచ్చని చెప్పారు. వివరాలకు 90324 77463 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సమన్వయ లోపం.. ప్రయాణికులకు శాపం

- శిథిలావస్థలో దువ్వాడ రైల్వేస్టేషన్ – మంగళపాలెం ప్రధాన రహదారి
- వాహనచోదకుల అవస్థలు



నాలుగో నంబర్ ప్లాట్‌ఫాం వైపు రోడ్డు



నాగదేవత కొండకు ఎదురుగా రోడ్డు ఇలా..



దువ్వాడ రైల్వేస్టేషన్ ఎదురుగా గోతులమయమైన ప్రధాన రహదారి

అగనంపూడి: వివిధ విభాగాల అధికారుల మధ్య సమన్వయ లోపం ప్రయాణికులకు శాపంగా మారింది. దువ్వాడ రైల్వేస్టేషన్ వెదుళ్లనరవ, మంగళపాలెం అనుసంధాన ప్రధాన రహదారి శిథిలమై ప్రయాణం నరకప్రాయమైంది.

విస్తరణ మాటే మరిచి..

దువ్వాడ రైల్వేస్టేషన్ నుంచి సబ్బవరం మండలం అసకపల్లి జంక్షన్ వరకు రహదారిని వందడుగులుగా అభివృద్ధి చేస్తామని వుడా ఎనిమిదేళ్ల క్రితం ప్రకటించింది. దువ్వాడ రైల్వేస్టేషన్ వద్ద బోర్డులు వేలాడదీసి, ప్రాథమిక చర్యలు చేపట్టింది. తరువాత ఏమైందో, అధికారులు విస్తరణ మాటే మరిచారు. ఇటు వుడా.. అటు జీవీఎంసీ కూడా పట్టించుకోపోవడంతో ఈ మార్గం ప్రయాణికులకు ప్రాణ సంకటంగా మారింది. రహదారి పలు చోట్ల శిథిలం కావడంతో వాహనచోదకులు పాట్లు పడుతున్నారు.

- ఫ్లైఓవర్ వంతెనపై రోడ్డు కాంక్రీట్ పెచ్చులూడిపోయి ఇనుప చువ్వలు బయటకు రావడంతో ద్విచక్రవాహనాలకు ఇబ్బందిగా మారింది. పాదచారుల కాళ్లకు తగిలి గాయాలు అవుతున్నాయి. వీటిని రైల్వే, జీవీఎంసీ సంయుక్తంగా మరమ్మతులు చేపట్టాల్సి ఉన్నా వీరికి పట్టడం లేదు.
- ఫ్లైఓవర్ వంతెన దిగువన, ఎగువ వైపున జగ్గరాజుపేటకు వెళ్లే మార్గంలో రహదారి పూర్తిగా ధ్వంసం కావడంతో వాహనాచోదకులు రాకపోకలకు ఇబ్బందులకు గురవుతున్నారు.
- నాలుగో నంబర్ ప్లాట్‌ఫాం ముఖ ద్వారానికి ఎదురుగా, పార్కింగ్ షెడ్లకు ఎదురుగా రోడ్డు పూర్తిగా కోతకు గురైంది. కొండవాలు ప్రాంతం నుంచి వర్షపు నీటి ప్రవాహ ధాటికి రోడ్డు కోతకు గురవ్వడంతో ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు.
- నాగదేవత కొండకు ఎదురుగా, మంగళపాలెం మలుపు వద్ద మార్గం రోడ్డు వద్ద గోతులు ఏర్పడడంతో రాత్రివేళల్లో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. జీవీఎంసీ, రైల్వే అధికారులు సంయుక్తంగా స్పందించి రహదారి శిథిలమైన ప్రాంతాల్లో పునర్నిర్మాణ పనులు చేపట్టాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.
- రైల్వే, జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ అధికారులను సమన్వయ పరిచి రహదారి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి, గోతులతో ఫీట్ల పాట్లు తప్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఫీట్లు చేస్తున్నాం

రెండేళ్ల నుంచి స్టేషన్ రహదారి కోతకు గురయింది. పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో, ఫీట్లు చేస్తున్నాం. వుడా, జీవీఎంసీ రహదారి విస్తరణ చేపడుతుందని ఎనిమిదేళ్ల నుంచి ఎదురు చూస్తున్నాం, కనీసం ఫలితం లేకపోయింది. జిల్లా అధికారులు స్పందించి, కనీసం రహదారి మరమ్మతులైనా చేపట్టాలి.

–చట్టి తాతారావు, కొత్తూరు కాలనీ

ఉన్నతాధికారులు స్పందించాలి

పలుచోట్ల రోడ్డు ధ్వంసం కావడంతో వాహనచోదకులు హైరానా పడుతున్నారు. ఆటోలు, ద్విచక్రవాహనాలు, కార్లలో ప్రయాణించాలన్నా భయపడుతున్నారు. కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్ స్పందించి రహదారి పునర్నిర్మాణ పనులకు ఆదేశాలివ్వాలి.

– సర్వసిద్ధి బోరయ్య, వెదుళ్లనరవ

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగు



ఎమ్మెల్యే నాగిరెడ్డికి మంగళ హారతితో స్వాగతం పలుకుతున్న మహిళలు

పెదగంట్యాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 75వ వార్డు గొందేశివీధి, ధర్మాల వీధి, మొల్లివానిపాలెం, అయ్యన్నపాలెంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. వైఎస్సార్ సీపీ 75వ వార్డు అధ్యక్షుడు గొందేశి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి అడుగడుగునా ఘన స్వాగతం లభించింది. ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి, గత మూడున్నరేళ్ల కాలంలో లబ్ధిదారులకు అందిన లబ్ధిని గురించి వివరించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 95శాతం వరకూ సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. నవరత్నాల ద్వారా పేద ప్రజలకు అండగా నిలిచారని, ముఖ్యంగా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేలా వారికి ప్రోత్సాహం అందిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ పథకాల అమలు తీరును స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉన్నా ఎవరికైనా లబ్ధి చేకూరకపోతే వెంటనే తమను సంప్రదించాలని సూచించారు. అనంతరం స్థానికులు ఇక్కడి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, మార్టుపూడి పరదేశి, జి.మహేశ్వరరెడ్డి, కొయ్య భారతి, గొందేశి వెంకటరమణారెడ్డి, వెంకటేష్, ఉరుకూటి సింహాద్రి, పెదరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కురందాస్ వంశీకృష్ణ యాదవ్, ప్రభాకర్‌రెడ్డి, పిట్టా రెడ్డి, సుమన్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా నూకాంబిక ఆలయ వార్షికోత్సవం



అమ్మవారి సన్నిధిలో నాయకులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధి నడుపూరు గ్రామంలో కొలువుదీరిన నూకాంబిక అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు బొడ్డు కృష్ణారావు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అమ్మవారిని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తిరెడ్డి, ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ, ఎస్‌బీఐలలో ప్రజా సంపదను కాపాడాలి



ఎస్‌బీఐ వద్ద ధర్నా చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

గాజువాక : ఎల్‌ఐసీ, ఎస్‌బీఐలలో ప్రజలు దాచుకున్న ధనాన్ని కాపాడాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ రెండు సంస్థల నుంచి వేల కోట్ల ప్రజాధనాన్ని కేంద్ర ప్రభుత్వం అదానీ గ్రూప్‌కు ధారాదత్తం చేసిందంటూ కణితి రోడ్‌లోని ఎస్‌బీఐ వద్ద నాయకులు సోమవారం ఆందోళనకు దిగారు. పీసీసీ ప్రతినిధి జెర్రిపోతుల ముత్యాలు మాట్లాడుతూ ప్రజా ధనాన్ని అక్రమంగా అదానీ గ్రూపునకు ఇవ్వడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. ఇలాంటి దుర్మార్గమైన నిర్ణయాలతో దేశం తిరోగమనంలోకి వెళ్తుందని, ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని ప్రజలు ఇంటికి పంపించే రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కొవిరి కోదండరావు, ఎం.వర్మ, యరబాల భూలోక, కట్టా అప్పారావు, రాజు, ఆనంద్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గంగవరం పోర్టు కాలుష్యంపై నిరసన



ఆందోళనలో పాల్గొన్న సీపీఎం నాయకులు

గాజువాక : గంగవరం పోర్టు కాలుష్యాన్ని అరికట్టాలని డిమాండ్ చేస్తూ స్వతంత్రనగర్ వై జంక్షన్ వద్ద సీపీఎం నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం గాజువాక కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ పోర్టు కాలుష్యంతో 10 గ్రామాల ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలను పోర్టు యాజమాన్యం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పోర్టు నుంచి రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాలు నిబంధనలను పాటించడం లేదని, ఈ కారణంగా ప్రమాదాలు కూడా చోటుచేసుకొంటున్నాయని తెలిపారు. కాలుష్య ప్రభావానికి గురవుతున్న గ్రామాలను పోర్టు యాజమాన్యం దత్తత తీసుకొని ప్రజల ఆరోగ్యానికయ్యే ఖర్చును భరించాలని డిమాండ్ చేశారు. అన్ని గ్రామాల్లోను ఉచిత మెడికల్ క్యాంపులను నిర్వహించి అవసరమైన సౌకర్యాలను అందుబాటులోకి తేవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.రాజేంద్ర ప్రసాద్, ఎ.లోకేష్, డి.రమణ, లక్ష్మి, శ్రీదేవి, సుబ్బారావు, రాజారావు, అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

నృసింహుడికి వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలకు కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఘనంగా గరుడసేవ శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం గరుడ సేవ ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడవాహనంపై అధిష్టంపజేశారు. అష్టోత్తరశతనామావళి పూజ అనంతరం భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. విశేషంగా హారతులు అందజేశారు. అర్చకుడు చిన్నా తదితరులు ఈ పూజ నిర్వహించారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు



ప్రమాదంలో నుజ్జయిన కారు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రధాన మార్గంలో వెళ్తున్న కారు అదుపు తప్పి, డివైడర్ ఎక్కిన ఘటనలో కారు నుజ్జు అయింది. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు వివరాలివి.. స్టీల్‌ప్లాంట్ థర్మల్ పవర్ ప్లాంట్ (టీపీపీ) విభాగానికి చెందిన పెద్దాడ శ్యామలరావు కూర్మన్నపాలెం నుంచి స్టీల్‌ప్లాంట్ వైపు కారులో ఒక్కరే వెళ్తున్నారు. శ్రీ చైతన్య జూనియర్ కళాశాల సమీపంలోకి వచ్చేసరికి కారు అదుపు తప్పి, డివైడర్ ఎక్కి రైలింగ్‌ను ఢీకొట్టి అవతల రోడ్డుపైకి దూసుకుపోయింది. కారు డ్రైవ్ చేస్తున్న శ్యామలరావుకు స్వల్ప గాయాలయ్యాయి. ఆ సమయంలో రెండు మార్గాల్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అనంతరం ఆయన్ను ఉక్కు జనరల్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఘటనకు సంబంధించి, స్టీల్‌ప్లాంట్ పోలీసులను సంప్రదించగా, ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ప్రత్యేక శ్రద్ధతో బోధించాలి

పరవాడ: పదో తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపర్చడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని యలమంచిలి ఉప విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ సూచించారు. ధర్మారాయుడుపేట జిల్లా పరిషత్ పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. తొలుత మధ్యాహ్న భోజన వంటకాలను పరిశీలించారు. రోజు వారీ మెనూను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వంటకాల విషయంలో ఎలాంటి లోటుపాట్లు వచ్చినా సహించబోమని మెనూ ప్రకారం తయారు చేయాలని సూచించారు. అనంతరం చదువుపై శ్రద్ధ చూపించి మంచి ఉత్తీర్ణత శాతం నమోదు చేయాలని విద్యార్థులకు డిప్యూటీ డీఈవో ప్రేమ్‌కుమార్ సూచించారు. హెచ్‌ఎం లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



సమావేశానికి హాజరైన కన్వీనర్లు, గృహసారథులు

పెదగంట్యాడ: వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి గృహ సారథులే రథసారథులని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత వారిపై ఉందన్నారు. గాజువాక క్లస్టర్–2కి చెందిన 66, 72, 73వ వార్డులకు చెందిన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ల శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గృహసారథులు, కన్వీనర్లు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందజేయాలని కోరారు. పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లను సమన్వయం చేసుకుని పని చేయాలన్నారు. అనంతరం శిక్షణకు సంబంధించిన వీడియో క్లిప్పింగులు ప్రదర్శించారు. ప్రభుత్వం రూపొందించిన స్టిక్కర్లను ఆవిష్కరించి పంపిణీ చేశారు. కార్యక్రమంలో 66, 73 వార్డుల కార్పొరేటర్లు మహ్మద్ ఇమ్రాన్, భూపతిరాజు సుజాత, వైఎస్సార్ సీపీ 72వ వార్డు ఇన్‌చార్జి సిరట్ల వాసు, గాజువాక–2 క్లస్టర్ కన్వీనర్ రాజాన వెంకటరావు, ఎస్‌ఎండీ గౌస్, పెదిరెడ్ల ఈశ్వరరావు, మదీనా బాషా తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డులోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని వార్డులను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.

ఇప్పటికే పలు వార్డుల్లో చేపట్టిన అభివృద్ధి పనులు చకచకా సాగుతున్నాయని తెలిపారు. కార్పొరేటర్ వంశీరెడ్డి మాట్లాడుతూ దయాల్‌నగర్ టీవీఎస్ పాయింట్, పోలీస్ క్వార్టర్స్ ఎదురుగా గల గవరవీధి, క్వారీ రోడ్డు చర్చి వద్ద, దల్లివానిపాలెం, కోనవానిపాలెంలో దెబ్బ తిన్న రోడ్లు, కాలువలను రూ.8లక్షల 50వేలతో నిర్మించనున్నామని వివరించారు. కార్యక్రమంలో ఎస్.వై. నాయుడు, గొందేశి సత్యారావు, దల్లి పైడికొండ, త్రినాథ్, గొందేశి వెంకటరమణారెడ్డి, కోన నాయుడు, జీవీఎంసీ ఏఈ వెంకటరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు రుణ సదుపాయంపై అవగాహన



మాట్లాడుతున్న ఏపీడీ సంతోష్ కుమార్

అక్కిరెడ్డిపాలెం: పేదల సొంతింటి కల సాకారమయ్యేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మహిళలకు ఒక సెంటు స్థలాన్ని కేటాయించి, ఇంటి నిర్మాణానికి ప్రభుత్వ సహకారంతో బ్యాంకుల నుంచి రుణాలు పొందే అవకాశాన్ని కల్పించారని ఏపీడీ సంతోష్ కుమార్ అన్నారు. ప్రతీ లబ్ధిదారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం రామాలయం వద్ద గల కమ్యూనిటీ హాల్లో డ్వాక్రా మహిళలతో ఆయన సమావేశమయ్యారు. ప్రభుత్వం కేటాయించిన స్థలాలు, ఇంటి నిర్మాణానికి బ్యాంకుల నుంచి రుణాలు పొందే విధానం, డ్వాక్రా రుణాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. గృహ నిర్మాణాలకు అదనంగా డ్వాక్రా ద్వారా విడుదలైన రుణాలను సత్వరం చెల్లించాలన్నారు. సొంతింటి కలను సార్థకం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీవో సుధారాణి, డ్వాక్రా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి వినతి



జెడ్సీకి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

గాజువాక : గాజువాకలోని వివిధ ప్రాంతాల్లోని ప్రజా సమస్యలను పరిష్కరించాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ అంశంపై జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. అనంతరం జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ గాజువాక కో–ఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు మాట్లాడుతూ కాలుష్యం, జనావాసాల్లో పందుల సంచారం వల్ల ప్రజలు ఆందోళన చెందుతున్నారని వివరించారు. గంగవరం పోర్టు రోడ్డు నుంచి వై జంక్షన్ మీదుగా జగ్గు జంక్షన్ వరకు వచ్చే భారీ లోడ్ వాహనాలవల్ల విపరీతమైన కాలుష్యం, ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. పలు వార్డుల్లో కొంతమంది అర్హుల పింఛన్లను తొలగించారని, వాటిని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శంకరరావు, ఎల్లాజీరావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన వేతనాలు అమలు చేయాలి



దీక్షలో పాల్గొన్న ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు వెంటనే నూతన వేతనాలు అమలు చేయాలని స్టీల్ ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం రిలే దీక్షలు చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ సెయిల్ కార్మికులకు వేతన ఒప్పందం అయిన వెంటనే నూతన వేతనాలను అమలు చేశారని తెలిపారు. ప్రతీ దానికి సెయిల్‌ను అనుసరించే విశాఖ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం సెయిల్‌లో కొత్త వేతనాలు అమలు చేసి 15 నెలలు అవుతున్నా, ఇక్కడ అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. వెంటనే యాజమాన్యం చర్యలు చేపట్టకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. యూనియన్ మిత్ర పక్షాలు, ఇతర సంఘాల నాయకులు పాల్గొని దీక్షలకు మద్దతు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలో కొనసాగించాలి

- ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకుల డిమాండ్
- దీక్షలకు రచయిత్రుల సంఘీభావం



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న అయోధ్యరామ్

కూర్మన్నపాలెం: కార్మికుల కష్టానికి కేంద్ర ప్రభుత్వం విలువనిచ్చి, విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేలా పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెం కూడలి వద్ద సీవో, సీపీపీ, వీయూపీపీసీ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 725వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ప్రజారచయిత్రుల వేదిక జాతీయ అధ్యక్షురాలు మల్లేశ్వరి, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కాత్యాయినీ విద్మహే, ప్రముఖ వకీల్ జవహారా, శాంతి ప్రబోధ అరుణజ్యోతి, తిరునగరి దేవకి పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకుడు జె.అయోధ్యరామ్, మల్లేశ్వరి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విశాఖ ఉక్కును అమ్మాలని ప్రకటించడం కార్మికుల జీవితాలతో ఆడుకోవడమే అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యోగులు, కార్మికులు, మేధావులు, విద్యార్థులు, కళాకారులు, రచయితలు పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేస్తున్నారన్నారు. ఉక్కు ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మలచి మరింత ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కె.బాబూరావు, టి. కనకరాజు, ఎస్. జ్యోతిప్రసాద్, శివ రామకృష్ణ, ఎం.శ్రీనివాస్, ఐఎన్‌టీయూసీ నాయకులు కొమ్ము ప్రసాద్, సుబ్బారావు, సీఐటీయూ నాయకులు కె.ఆనంద్‌కుమార్, కొల్లి నాగేశ్వరరావు, పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

87వ వార్డులో వెలగని వీధిలైట్లు



87వ వార్డు కాళింగవీధిలో చీకటిగా ఉన్న రోడ్డు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధి కాళింగవీధిలో 10 రోజులుగా వీధిలైట్లు వెలగడం లేదు. చీకటి పడితే వీధుల్లో ప్రయాణించాలంటేనే భయం వేస్తోంది. రాత్రివేళల్లో రోడ్డు కనిపించక వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. విద్యుత్ అధికారులకు గతంలోనూ ఫిర్యాదు చేశాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి, వీధి లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలి.

–దుగ్గపు రమణమ్మ, కాళింగ వీధి